సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 7 । డిసెంబర్ । 2024

అంబేడ్కర్‌కు నివాళి



సిరిసిల్ల: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్ర పటానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకట ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్, డీఎస్ సీడీవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, బోయినపల్లి 'సెస్' డైరెక్టర్ సుధాకర్, దళిత నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలి

బోయినపల్లి(చొప్పదండి): ఉపాధిహామీ పనుల్లో కూలీల భాగస్వామ్యం పెంచాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. మండల పరిషత్‌లో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై సమీక్షించారు. డీఆర్డీవో శేషాద్రి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల మస్టర్లలో జరిగిన తప్పులు, నర్సరీ ప్లాంటేషన్లలో రిజిష్టర్లు రాయకపోవడాన్ని గుర్తించామన్నారు. ఈజీఎస్, ఫారెస్ట్, పీఆర్ పనులకు సంబంధించి రూ.20 వేలు రికవరీకి, మరో రూ.7వేలు జరిమానా విధించినట్లు ఈజీఎస్ ఏపీవో సబిత తెలిపారు. అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ రామారావు, ఎస్టీఎం అంజద్ అలీ, ఎంపీడీవో జయశీల, ఎస్ఆర్పీ భగవంతరావు, అంబుడ్స్‌మెన్ రాకేశ్, ఎంపీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి, హామీలపై నిలదీస్తున్న గొంతుకలను నొక్కుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం తెల్లవారుజామున ఆగయ్యతోపాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌లకు నిరసనగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే నిరసనకు వెళ్లకుండా వారిని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, పందిర్ల పర్శ రాములుగౌడ్, అందె సుభాష్, ఎడ్ల సందీప్, ఎడ్ల లక్ష్మణ్‌లను ఠాణాకు తరలించారు.

సీఎం కప్ యోగా పోటీలు



సిరిసిల్లటౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాలతో ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం కప్ పోటీలను జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో ఆరో రోజు శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ ఇందిరాపార్కులో యోగా క్రీడా కార్యక్రమాలను జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో 30 మంది యువత, వృద్ధులు పాల్గొన్నారు. డీవైఎస్‌వో రాందాస్, యోగా శిక్షకులు ఉప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పనితీరు బాగుందని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రశంసించారు. ముస్తాబాద్ ఠాణాను శుక్రవారం సందర్శించారు. పెండింగ్ ఫైళ్లు, రౌడీషీటర్లు, దొంగతనాలు తదితర కేసులపై సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయరాదన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను పరిశీలించారు. ఠాణా ఆవరణలో మొక్క నాటారు. పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. మండల వాలీబాల్ జట్టుకు జెర్సీలు అందించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ మొగిలి, ఎస్సై గణేశ్ ఉన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకమని ఎస్పీ అఖిల్‌మహాజన్ కొనియాడారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయుధ హోంగార్డు ప్లాటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించి కవాతు పరిశీలించారు.

బోనమో పోచమ్మ





సిరిసిల్లటౌన్: ముదిరాజ్ కులస్తులు శుక్రవారం పోచమ్మతల్లి బోనాల పండుగ నిర్వహించారు. పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇంటికొక బోనం చొప్పున ర్యాలీగా ఆలయానికి బయలుదేరారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కీసరి నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కరుణాల భద్రాచలం, ఉపాధ్యక్షుడు కర్ల పర్శరాములు, కోశాధికారి చెన్నమనేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- మహిళల పేరిటే మంజూరుకు సర్కారు నిర్ణయం
- యాప్ ఆవిష్కరణ
- 10వ తేదీ వరకు ప్రజాపాలన అర్జీల్లోని వివరాలు నమోదు
- ఉమ్మడి జిల్లాకు కేటాయించిన ఇళ్లు 42 వేలు



ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

ప్రజాపాలనలో వచ్చిన అర్జీలు
కరీంనగర్ : 3,48,811, పెద్దపల్లి : 1,85,404
జగిత్యాల : 2,00,108, సిరిసిల్ల : 1,10,198, మొత్తం : 8,44,521

సాక్షి, పెద్దపల్లి/సిరిసిల్ల: సొంతింటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల ఆశలు ఫలించనున్నాయి. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మహిళల పేరిటే ఇళ్ల మంజూరుకు నిర్ణయించారు. మొదట విడతలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థికసాయం అందించనుండటంతో తమ సొంతింటి కల నెరవేరనుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

35 ప్రశ్నలు..

ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, వివరాలను నమోదు చేసుకోవచ్చు. లబ్ధిదారు పేరు, ఆధార్ ఐడీ నంబర్, సంవత్సర ఆదాయం, సొంత స్థలం ఉందా? ఇదివరకు ఎప్పుడైనా ఇళ్ల పథకం లబ్ధి పొందారా.. తదితర 35 ప్రశ్నలకు సమాధానలు నమోదు చేయాలి. లబ్ధిదారులు ఫోన్‌లో చేసుకోలేకపోతే అధికారులు ఇంటికి వచ్చినప్పుడు సమాచారం చెప్పాలి. యాప్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి, లబ్ధిదారు ముఖాన్ని, ఇల్లు నిర్మించే స్థలానికి భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని సైతం ఏఐ ఆధారంగా ఫొటోలు తీయనున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 10 వరకు మండల పరిధిలో పీడీవోల ఆధ్వర్యంలో, మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక అధికారుల సమక్షంలో వివరాలు యాప్‌లో నమోదు చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగి, ఆస్తి పన్ను చెల్లింపుదారు, మూడు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారు, గతంలో లబ్ధి పొందిన వారిని గుర్తించనున్నారు.

8.44 లక్షల దరఖాస్తులు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ స్కీం స్థానంలో గతంలో ఉన్నట్టు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు ప్రజాపాలన కార్యక్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8.44 లక్షల అర్జీలు వచ్చాయి. అలాగే, గ్రామ, వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసింది. అయితే, ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ శాఖ పర్యవేక్షిస్తుందా.. లేక ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధి కారులు పర్యవేక్షిస్తారా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పథకానికి కూడా కలెక్టర్లనే నోడల్ అధికారులుగా ఎంపిక చేసే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అర్జీదారులకు సొంత స్థలం ఉందా? బీపీఎల్ పరిధిలో ఉన్నారా? గ్రామంలో ఓటు హక్కు ఉందా? ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది? తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని, అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం.

వీరికే మొదటి ప్రాధాన్యం..

ఇందిరమ్మ ఇళ్లను ప్రాధాన్యతా క్రమంలో కేటాయించనున్నారు. సొంత ఇంటి స్థలం కలిగిన అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరిలో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ముందుగా ఇళ్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని గరిష్ట స్థాయిలో వినియోగించుకొని, ఇల్లు నిర్మించుకునేలా ప్రతీ మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి, చూపించనున్నారు. మొదటి విడత ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు కేటాయించారు. ఇలా.. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు 42 వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మూడు విడతల్లో నిధులు ఇవ్వనున్నారు. అదనంగా ఒక గది కట్టుకుంటామంటే వెసులుబాటు కల్పించారు.

మాట నిలబెట్టుకున్నాం

- ఏడాదిలోనే రూ.1,000 కోట్లు మంజూరు చేయించాం
- నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు
- అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం
- 'సాక్షి'తో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



సాక్షి, పెద్దపల్లి: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశా.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా.. భవిష్యత్‌లో చేపట్టే పనులన్నీ సకాలంలో పూర్తిచేస్తా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్దపల్లి నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి ఏడాదిలోనే జరిగింది. ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రతీగడపకు చేరాయి. గత ప్రభుత్వ పదేళ్ల పాలన, నా ఏడాది పాలనతో పోల్చితే ప్రజలకే అర్థమవుతుంది.. నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారో.. వారే ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నా..' అని ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పెద్దపల్లి శాసన సభ్యుడు చింతకుంట విజయరమణారావు 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి: ఏడాది పాలనలో సాధించిన ప్రగతి?

ఎమ్మెల్యే: జిల్లా ఆస్పత్రిని రూ.52 కోట్లతో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశాం. రూ.81కోట్లతో మూడు కోర్టుల నిర్మాణం, రూ.100 కోట్లతో ఇంటిగ్రేడ్ స్కూల్, ఓదెలలో మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ. 82కోట్లు మంజూరు చేయించాం. పెద్దపల్లి బల్దియాకు రూ.15కోట్లు, సుల్తానాబాద్‌లో రూ.5కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఆర్అండ్‌బీ ద్వారా రూ.30 కోట్లతో పనులు చేపట్టాం. జూలపల్లి–కాచాపూర్ మధ్య రూ.19కోట్లతో డబుల్ రోడ్లు, కాచాపూర్–నిట్టూరు మధ్య రూ.12 కోట్లు, చందపల్లి–మద్దికుంట మధ్య రూ.6కోట్లు, మద్దికుంట–కాచాపూర్ మధ్య రూ.8కోట్లు, గుంపుల–పొత్కపల్లి మధ్య రూ.10కోట్లు, గుంపుల–ఓదెల మధ్య రూ.3కోట్లు, పొత్కపల్లి–కాల్వశ్రీరాంపూర్ మధ్య రూ.25కోట్లతో ఆర్అండ్‌బీ ద్వారా రోడ్ల నిర్మాణం ప్రారంభించాం. రూ.21కోట్లతో పంచాయతీరాజ్, ఎస్ఆర్‌జీఎస్ ద్వారా రూ.10 కోట్లు, ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.10కోట్లు, డీఎంఎఫ్‌టీ ద్వారా రూ.15కోట్లు వెచ్చించాం. ఒక్కో హెల్త్ సెంటర్‌కు రూ.22లక్షల చొప్పున 12 ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నాం. మహిళా సాధికారత కోసం జిల్లా కేంద్రంలో రూ.5కోట్లతో ఇందిరా మహిళ శక్తి భవనం, రూ.5కోట్లతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. గతంలో భట్టి విక్రమార్క చేతుల మీదుగా 3 విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభించాం. టీయూఎస్ఎఫ్ కింద పెద్దపల్లిలో రూ.30కోట్లు, సుల్తానాబాద్‌లో రూ.10 కోట్లతో పనులు చేపడుతున్నాం. సీఎం సభ రోజు ప్రత్యేక జీవో ద్వారా పెద్దపల్లికి రూ.15కోట్లు, సుల్తానాబాద్ పట్టణానికి రూ.5 కోట్లు మంజూరు చేయించుకున్నాం. ఇలా ఏడాదిలో సుమారు రూ.1,000 కోట్లకుపైగా వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాం. నియోజకవర్గప్రగతిని పరుగులు పెట్టిస్తున్నాం.

సాక్షి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారు?

ఎమ్మెల్యే: సన్నవడ్లకు రూ.500 బోనస్‌తో గురువారం వరకు రూ.30కోట్ల పైచిలుకు డబ్బులు రైతు ల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. 33,706 మంది అన్నదాతలకు రూ.243.80 కోట్లు రైతురుణమా ఫీ చేశాం. దీంతో వారు మళ్లీ రుణం పొంది సాగు చే సుకుంటున్నారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దని దివంగత సీఎం వైఎస్సార్ ఐకేపీ కేంద్రా లు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం 5 – 15 కేజీల వరకు ధాన్యంలో కోత పెట్టి రైతులను మోసం చే సింది. అందుకున్న భిన్నంగా ఈసారి ఒక్కగింజ కూడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపుల్లో పె ద్దపల్లి రాష్ట్రంలోనే బెస్ట్‌గా నిలిచింది. ప్రతిపక్షాలు తప్పుడు మాటలు బంద్‌చేయాలి. అభివృద్ధిపై లే దా, ధాన్యం కొనుగోళ్లపై.. ఇలా ఏదైనా సరే.. ఏ కొ నుగోలు కేంద్రానికి వచ్చినా చర్చకు మేం సిద్ధం. ని యోజకవర్గంలో 95శాతం మందికి సంక్షేమ ఫలా లు అందుతున్నాయి. ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యా స్, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, ఉచిత బస్సు ప్రయాణంతో అనేకమంది లబ్ధిపొందుతున్నారు.

సాక్షి: నియోజకవర్గంలో మీదైన ముద్ర వేసేలా చేపట్టిన పనులు ఉన్నాయా?

ఎమ్మెల్యే: జిల్లా కేంద్రం, పార్లమెంట్ కేంద్రమైన పెద్దపల్లిలో ఆర్టీసీ బస్‌స్టాండ్ లేదు. అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు వచ్చిపోయారు. హామీలు ఇచ్చి విస్మరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడి సభకు రాకముందే ప్రతీ హామీ అమలు చేసేలా జీవోలు జారీచేయించా. ఇది నా పనితీరుకు నిదర్శనం. ఇక్కడి ప్రజల చిరకాల కోరిక ఆర్టీసీ బస్‌డిపో సాధించా. తెలంగాణ ఏర్పాటైనప్పుడు ఎంతో సంతోషపడ్డారో.. పెద్దపల్లికి బస్‌డిపో ఏర్పాటైనప్పుడు అంతే సంతోషపడ్డారు. ఏడాదిలో బైపాస్ లేక హైవేపై 9మంది ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. ఆ సమస్యకు పరిష్కారం చూపుతూ రూ.82కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మించబోతున్నాం. ఎలిగేడు మండలానికి పోలీస్‌స్టేషన్ మంజూరు చేయాలనే డిమాండ్ 23ఏళ్లుగా ఉంది. రాష్ట్రచరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా ఒకేరోజు జిల్లాకు నాలుగు(మహిళా, పెద్దపల్లి రూరల్, ట్రాఫిక్, ఎలిగేడు) పోలీస్‌స్టేషన్లు మంజూరు చేయించా. ఇసుక సరఫరా ఉచితం చేశా. గతంలో ట్రాక్టర్ రూ.3,400కు దొరికేది.. ఇప్పుడు కేవలం రూ.1,400కే ట్రాక్టర్ ఇసుక లభిస్తోంది.

సాక్షి: వచ్చే నాలుగేళ్లలో అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి?

ఎమ్మెల్యే: గతంలో ఈ ప్రాంత ప్రజల సాగునీటి కోసం జైలుకు పోయిన. అన్నదాతల నీటి కష్టాలు తెలిసినవాడిని. చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పత్తిపాక రిజర్వాయర్ పూర్తిచేయిస్తా. ఇప్పటికే అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. పత్తిపాక రిజర్వాయర్‌తో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 2.45లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. కొత్తగా సుమారు 8వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ రిజర్వాయర్‌తో అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గానికి ప్రయోజనం చేకూరుతుంది. అగ్రికల్చర్ కాలేజీ తీసుకొస్తా. విద్య, వైద్యం, అన్నదాతల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తా.

నిందితులకు శిక్షపడేలా కృషి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగవంతంగా పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నియంత్రణపై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ ట్రైబ్ శాఖల పరిధిలోని హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, స్టడీసర్కిల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో పాడిపశువుల యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో నవంబర్ 30 నాటికి 30 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వీటిపై వారం రోజుల్లో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 2016 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎనిమిది మర్డర్లు, నాలుగు రేప్ కేసులు, 486 అట్రాసిటీ ఫిర్యాదులు వచ్చాయని, రూ.5.64కోట్లను పరిహారంగా అందించినట్లు వివరించారు. మరో రూ.1.75కోట్ల పరిహారం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు ఆర్డీవోలు ఉపేందర్‌రెడ్డి, రాజేశ్వర్, సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ము బాలయ్య, అజ్మీర తిరుపతి, మెట్ట దేవానంద్, కొట్టెపల్లి సుధాకర్, పాసుల బాలరాజ్, ఎన్జీవో సభ్యులు డాక్టర్ అలువాల ఈశ్వర్, డప్పుల అశోక్, సిరిగిరి రామచందర్ పాల్గొన్నారు.

అవసరాలే ఆవిష్కరణలు

వేములవాడ: ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు విద్యార్థులు తమ ఆవిష్కరణలతో పరిష్కారం చూపారు. వేములవాడలో శుక్రవారం ప్రారంభమైన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న ఎగ్జిబిట్లు ఆకట్టుకుంటున్నాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారు.

- వివరాలు 8లో



ఈ చిత్రంలో కనిపిస్తున్న జి.అమిత గాలిపెల్లికి చెందిన హైస్కూల్ విద్యార్థిని. కూరగాయలు అమ్ముకునే వీధివ్యాపారుల కష్టాలకు పరిష్కారంగా పోర్టబుల్ టేబుల్‌ను తయారుచేసింది. వివిధ సామగ్రిని ఈ టేబుల్‌లో సర్దుకొని, మడుచుకొని దీనికి అమర్చిన చక్రాల సాయంతో ఎక్కడికంటే అక్కడికి లాక్కెళ్లవచ్చు.

వైద్య వృత్తి గౌరవప్రదమైంది



వైట్‌కోట్ అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల: సమాజంలో వైద్యవృత్తి ఎంతో గౌరవ ప్రదమైంది, శ్రద్ధగా వైద్యవిద్యను అభ్యసించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల మెడికల్ కాలేజీలో శుక్రవారం వైట్‌కోట్ వేడుకలు నిర్వహించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాలకు అవసరమైన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు వైట్‌కోట్‌ను అందించారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు బి.లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకుడు పెంచలయ్య, డాక్టర్ చీకోటి సంతోష్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహుని సేవలో పీఠాధిపతి



పూజలు చేస్తున్న మాదవానంద సరస్వతి

ధర్మపురి: తొగుట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాదవానంద సరస్వతి స్వామిజీ శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామివారలను దర్శించుకున్నారు. ముందుగా పీఠాధిపతికి పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలుకగా, ప్రధాన, అనుబంధ ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం స్వామిజీకి ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్, అర్చకులు తదితరులున్నారు.

మూడిళ్లలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో గురువారం రాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుదవేని సుమలత గురువారం తన ఇంటికి తాళం వేసి మెట్‌పల్లికి వెళ్లగా, ఆమె ఇంటిలోని బీరువా పగలగొట్టి 10 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని రాసురి గంగాధర్ ఇంట్లో బీరువా పగలగొట్టి రూ.5 వేలు చోరీ చేశారు. అలాగే జరుపుల కిష్టయ్య ఇంటి తాళం పగలగొట్టినప్పటికీ వస్తువులను ఎత్తుకెళ్లలేదు. శుక్రవారం ఘటన స్థలానికి క్లూస్‌టీం అధికారులు వచ్చి ఆధారాల కోసం ప్రయత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సాహితిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట(సిరిసిల్ల): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గంభీరావుపేట మండలం గజసింగవరం హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని చల్ల సాహితి ఎంపికైంది. గత నెలలో రాష్ట్రస్థాయిలో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో అండర్–14 విభాగం కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈనెలలో మహారాష్ట్రలోని అమరావతిలో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో సాహితి పాల్గొననుంది. పాఠశాల హెచ్‌ఎం శీలం సోమయ్య, ఉపాధ్యాయులు బద్రోద్దీన్, రామచంద్రం, లక్ష్మణ్, యాదగిరి, నారాయణ, లక్ష్మీబాయి, దివ్యరాణి, దీప అభినందించారు.

భారం తగ్గించేందుకు..



ఈ విద్యార్థిని సిరిసిల్ల అర్బన్ మండలంలోని కేజీబీవీకి చెందిన బోడపట్ల అవంతిక. భవన నిర్మాణ కార్మికులు నెత్తిమీద బరువు మోస్తూ.. త్వరగా అలసిపోవడాన్ని చూసి పరిష్కార మార్గం కోసం అన్వేషించింది. బరువు మొత్తం నెత్తిమీదనే పడకుండా భుజాలపై పడితే కొంతమేరకు భారాన్ని తగ్గించవచ్చనే ఉద్దేశంతో పరికరాన్ని తయారు చేసింది. ఇది చూపరులను ఆకట్టుకుంటుంది.

కాలుష్య నివారణకు..



ఈ విద్యార్థిని వేములవాడలోని కృష్ణవేణి స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని బి.శివహిత. ఫ్యాక్టరీల ద్వారా వెలువడే కార్బన్‌ను తొలగించే పరికరాన్ని తయారుచేసింది. దీని ద్వారా వాయుకాలుష్యం కొంతవరకు తగ్గించ వచ్చని వివరిస్తుంది. పరికరం తయారీకి గైడ్‌టీచర్స్ టి.వెంకటేశ్, ఎన్.భాస్కర్‌రెడ్డి సహకరించారని, పది రోజులు శ్రమించి పూర్తి చేసినట్లు తెలిపింది.

అవసరాలే ఆవిష్కరణలు

- సామన్యుల సమస్యలకు విద్యార్థుల పరిష్కారం
- వేములవాడలో సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శన
- ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు



జిల్లా సైన్స్‌ఫేర్‌లో భాగస్వాములైన విద్యార్థులు

వేములవాడ: సామన్యుల అవసరాలే విద్యార్థుల ఆవిష్కరణలుగా మెరిశాయి. నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలుగా సైన్స్‌ఫేర్‌లో ఎగ్జిబిట్స్ ఆకట్టుకుంటున్నాయి. వేములవాడలో శుక్రవారం ప్రారంభమైన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ సైన్స్‌ఫేర్‌కు వేములవాడలోని ప్రభుత్వ హైస్కూల్ వేదికగా నిలిచింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. 400లకు పైగా నమూనాలు ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల నుంచి దాదాపు 800లకు పైగా విద్యార్థులు, 250 మంది టీచర్లు పాల్గొన్నారు. జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సైన్స్‌ఫేర్‌తో సృజనాత్మకత వెలుగులోకి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్‌ఫేర్ దోహదపడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కొద్ది కాలంగా మన ప్రాంతం నుంచి విద్యార్థులు విద్య, శాస్త్ర, సాంకేతిక, విజ్ఞానపరంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారని కొనియాడారు. త్వరలోనే వేములవాడలో సైన్స్ మ్యూజియం అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

వేములవాడలో నిర్వహిస్తున్న సైన్స్‌ఫేర్‌లో 400కు పైగా నమూనా ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్‌లో 68 ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వారికి సరిపడా సౌకర్యాలు ఏర్పాటు చేశాం. భోజన వసతి కల్పించాం. శనివారం సైతం ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

– జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

ఇటుకలు మోసేందుకు..



వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని జట్టి దీక్షిత. భవన నిర్మాణ కార్మికులు నెత్తిపై ఇటుకలు మోసే భారం తగ్గించాలనే ఆలోచనతో పరికరాన్ని తయారు చేసింది. ఇనుపరాడ్‌తో 6 నుంచి 7 ఇటుకలను తీసుకెళ్లేలా పరికరాన్ని తయారు చేసి శభాష్ అనిపించుకుంది.

ప్రమాదాలు అడ్డుకునేలా..



రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు సెన్సార్ పరికరాన్ని తయారు చేశాడు వేములవాడలోని కృష్ణవేణి టాలెంట్‌స్కూల్‌కు చెందిన రామ్‌చరణ్. గైడ్‌టీచర్లు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ సహాయంతో 20 రోజులపాటు శ్రమించి, రూ.2వేల ఖర్చుతో తయారు చేశాడు. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే దారి మార్చుకొని సురక్షిత మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకుంటుంది.

రాజన్న కోడెలు పక్కదారి !

- ఆలయ అధికారుల మౌనం
- కలకలం సృష్టిస్తున్న సొసైటీ లెటర్



గోశాలలోని కోడెలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నకు భక్తులు కోడెమొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. కోర్కెలు నెరవేరితే ఇంటి నుంచి నిజకోడెలను తీసుకొచ్చి ఆలయ అధికారులకు అప్పగిస్తుంటారు. ఇలా వచ్చిన కోడెలు, ఆవులను వేములవాడ, తిప్పాపూర్‌లలోని గోశాలలో సంరక్షిస్తుంటారు. గోశాలలో కోడెలు, ఆవుల సంఖ్య పెరిగిపోతుండడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని గోశాలలకు ఉచితంగా ఇస్తుంటారు. ఇలా కోడెలు, ఆవులను తీసుకెళ్లిన పలు గోశాలల నిర్వాహకులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.

సొసైటీ పేరుతో కోడెల దందా

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామంలో శ్రీరాజేశ్వర సొసైటీ అధ్యక్షుడు మాదాసి రాంబాబు పేరుతో ఏర్పాటు చేసిన లెటర్ ప్యాడ్‌తో రాజన్న కోడెలను తరలిస్తున్నట్లు లేఖ కలకలం సృష్టిస్తుంది. ఈ లేఖను రాష్ట్ర మంత్రి సిఫారసు చేసినట్లు ఉంది. 60 కోడెలకు 49 కోడెలు పక్కదారి పట్టడం చర్చనీయాంశమైంది. ఈ లెటర్‌పై రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా లిఫ్ట్ చేయలేదు. ఆలయ అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఆలయ అధికారులు మౌనం పాటించడంలో ఆంతర్యం ఏమిటోనని భక్తులు విమర్శిస్తున్నారు. శ్రీరాజేశ్వర సొసైటీ పేరుతో అక్కడ ఎలాంటి గోశాల లేదని, ఇక్కడి నుంచి తీసుకెళ్లిన కోడెలను సంతకు అమ్ముతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

పోలీసుల విచారణతోనే..

గీసుకొండ ఠాణాలో మాదాసి రాంబాబుపై కేసు నమోదు చేసిన పోలీసులు వేములవాడ రాజన్న ఆలయ అధికారులకు గురువారం నోటీసులు పంపించారు. ఆలయ అధికారులు ఇచ్చిన సమాధానంతో పూర్తిస్థాయిలో విచారణ చేపడితే కోడెలు పక్కదారి పట్టిన విషయం బట్టబయలు కానుంది. గత జనవరిలో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో బహిరంగదళ్ నాయకుల ఫిర్యాదుతో కోడెలు దుర్వినియోగం అవుతున్నాయని పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి గోశాలలకు కోడెలు ఇవ్వడం నిలిపివేశారు. స్థానిక రైతులకు కోడెలు, ఆవులను పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే సొసైటీ పేరుతో లెటర్ ఉండడంతో కోడెలు పక్కదారి పట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే కోడెలను ఎప్పుడు తీసుకెళ్లారనే విషయం వెలుగు చూడనుంది. మొత్తానికి రాజన్న కోడెల వ్యవహారం వేములవాడలో హాట్‌టాపిక్‌గా మారింది.



SRI RAJESHWARA SOCIETY

శ్రీరాజేశ్వర సొసైటీ లెటర్



రాజన్న ఆలయంలో భక్తులు

కోడెమొక్కులు.. కుంకుమపూజలు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కోడెమొక్కులు, అమ్మవారికి కుంకుమ పూజలు, బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.





కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు, కుంకుమపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు

వేములవాడరూరల్/బోయినపల్లి(చొప్పదండి): అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు ఏడాది జైలుతోపాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. బోయినపల్లి మండలం తడగొండకు చెందిన మహేందర్‌కు గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన మమతతో 2011లో వివాహమైంది. కొద్ది సంవత్సరాల తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని మహేందర్ భార్యను వేధింపులకు గురిచేశాడు. భర్త వేధింపులు భరించలేక 2017లో మమత బోయినపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ విక్రమ్ వాదించారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్‌నాయుడు, పీసీలు మధుసూదన్, రాజేంద్రప్రసాద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహేందర్‌కు జైలుతోపాటు జరిమానా విధించినట్లు సీఐ శ్రీనివాస్ వివరించారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం మల్యాల అనుబంధ గ్రామం గనుండ్లపల్లిలో తాళం వేసిన ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. మల్యాల గ్రామానికి చెందిన సత్తవ్వ గురువారం సిరిసిల్లలో ఉంటున్న తమ్ముడి ఇంటికెళ్లింది. ఈ విషయం తెలిసిన వారే ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి 2 తులాల బంగారం, రూ.లక్షను ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు ఆరోపిస్తుంది. కాగా అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడినట్లు గుర్తించారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన జేరిపోతుల శ్రీనివాస్ ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. ఈమేరకు బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. ఆస్పత్రి గేటు వద్ద రాత్రిపూట పార్కు చేశాడు. అయితే తర్వాత బైక్ మాయమైంది. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు గాలిస్తున్నారు.

రిటైర్డ్ టీచర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల కల్చరల్: రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ మల్లారం పురుషోత్తం ప్రభుత్వాన్ని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగుల జీపీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ సరెండర్ తదితర పెండింగ్ బిల్లులు ట్రెజరీ ఆమోదం పొంది ఈ కుబేర్‌కు వెళ్లాయన్నారు. జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు మాదాసు బలరాం, జిల్లా బాధ్యులు చౌకి సుధాకర్, లక్ష్మణరావు, మోహన్‌రావు, ధ్యావనపెల్లి పరమేశ్, పి.ధర్మయ్య, ఎం.హనుమాండ్లు, టి.అంజయ్య, ఎం.దేవయ్య, ఎస్.కిరణ్‌కుమార్, జి.అంజయ్య, అబ్దుల్ ఖాదీర్, సయ్యద్ మహబూబ్, ఎస్.కిరణ్‌చారి, టి.అంజయ్య, నారాయణ, లలిత, ఎం.రమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లి హైస్కూల్ విద్యార్థిని యాల్ల నందిని, రహీంఖాన్‌పేట మోడల్‌స్కూల్ విద్యార్థిని పయ్యావుల వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఉమెన్స్ విభాగంలో ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

స్వగ్రామానికి మావోయిస్ట్ మల్లయ్య మృతదేహం



నివాళి అర్పిస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

పాలకుర్తి(రామగుండం): ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. ఇందులో చనిపోయిన ఏగోళపు మల్లయ్య ఉరఫ్ మధు ఉరఫ్ కోటి మృతదేహాన్ని శుక్రవారం రాత్రి తన స్వగ్రామమైన రాణాపూర్ గ్రామానికి చేరుకుంది. మల్లయ్య మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని ఆయన భార్య మీనా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో మల్లయ్య మృతదేహాన్ని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. శుక్రవారం రీపోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులు స్వగ్రామానికి తీసుకొచ్చారు. పౌరహక్కుల సంఘాల నేతలు, మాజీ మావోయిస్టులు మల్లయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

జేఎన్టీయూలో జాతీయ వర్క్‌షాప్



మాట్లాడుతున్న రమేశ్ ఠాకూర్

రామగిరి(మంథని): సెంటినరీకాలనీ జేఎన్టీయూలో శుక్రవారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి వర్క్‌షాప్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తారు. ఆర్థబొటిక్స్, రొబోటిక్స్ అంశాలపై ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ మేనేజర్, మెకానికల్ విభాగధిపతి రమేశ్ ఠాకూర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెకానికల్ బ్రాంచ్‌తోనే మిగతా బ్రాంచ్‌లకు విలువ ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రాధాన్యం తగ్గినా.. విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. మెకానికల్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, ఇన్నోవేషన్ టెక్నాలజీకి చెందిన ట్రెయినర్లు సతీశ్, శేఖర్, ఫ్యాకల్టీ సలహాదారు స్వప్న, స్టూడెంట్ కో ఆర్డినేటర్లు లోకేశ్, శ్రీనాథ్, లావణ్య, సంగీత పాల్గొన్నారు.

వస్త్రోత్పత్తికి నూలు.. నేతన్నలకు మేలు

- 90 శాతం ఉద్దెరపై నూలు
- నేటి నుంచి సరఫరా



వేములవాడ యారన్ డిపోలో నూలు



సిరిసిల్లలో వస్త్రోత్పత్తి

సిరిసిల్ల: నేతన్నలు ఇన్నాళ్లు వస్త్రోత్పత్తికి అవసరమైన నూలు కొనుగోలుకు అప్పులు చేసేవారు. ఇక నుంచి వారి కష్టాలు దూరంకానున్నాయి. శనివారం నుంచి టెస్కో ద్వారా నేతన్నలకు అరువుపై నూలు సరఫరా చేసేందుకు జౌళిశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. వేములవాడ వ్యవసాయ మార్కెట్‌యార్డులో రూ.50కోట్లతో ఏర్పాటు చేసిన నూలు డిపో ద్వారా యారన్(దారం) అందించనున్నారు. బట్ట తయారీకి అవసరమైన నూలును 90 శాతం ఉద్దెర్పై సరఫరా చేయనుంది. దీని ద్వారా వస్త్రోత్పత్తిలో పెట్టుబడి భారం తగ్గడంతోపాటు ఆసాములకు నేరుగా ప్రయోజనం దక్కనుంది. పెద్దసేట్ల(మాస్టర్ వీవర్స్) ప్రమేయం తగ్గనుంది.

ఆర్‌వీఎం వస్త్రాలకు నూలు సరఫరా

నేతన్నలకు వచ్చిన రాజీవ్ విద్యామిషన్(ఆర్‌వీఎం) ఆర్డర్లకు అవసరమైన నూలును వేములవాడ డిపో నుంచి సరఫరా చేయనుంది. సిరిసిల్లలోని 128 మ్యాక్స్ సంఘాలకు ఆర్వీఎం ద్వారా రూ.36.51కోట్ల విలువైన 66లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి ఆర్డర్లు వచ్చాయి. ఈ బట్ట తయారీకి అవసరమైన నూలును వేములవాడ డిపో ద్వారా 90 శాతం ఉద్దెరగా అందించనున్నారు. బట్టను ఉత్పత్తి చేసినందుకు జాబ్‌వర్క్‌లాగా కూలీ డబ్బులు వస్తాయి. పెట్టుబడిదారులు(మాస్టర్‌వీవర్స్) ప్రమేయం లేకుండానే నేతన్నలకు మేలు కలుగనుంది. సిరిసిల్లలోని 26వేల మరమగ్గాలు(సాంచాలు) పనిచేస్తే 13.20 లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రం, 6.60 మీటర్ల కాటన్ బట్ట ఉత్పత్తి అవుతుంది. ఈ లెక్కన ఏడాదిలో 20వేల టన్నుల పాలిస్టర్, 5 టన్నుల కాటన్ నూలు వాడుతారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆర్డర్లకు మాత్రమే నూలు అరువుపై సరఫరా చేయాలని జౌళిశాఖ భావిస్తుంది.

నాణ్యమైన నూలుతో వస్త్రాల తయారీ

ప్రస్తుతం వేములవాడ నూలు డిపోలో 2/30 నూలు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రభుత్వ ఆర్డర్‌లో 35 శాతం మేరకు నూలు అంటే.. 64 కిలోల 30 సంచులను అందిస్తారు. దీని విలువ రూ.4,73,472 కాగా.. ఇందులో 10 శాతం అంటే.. రూ.47,347 డీడీలు చెల్లిస్తే 30 సంచుల నూలు ఆసాములకు చేరుతుంది. ఆ నూలుతో ఆర్‌వీఎం బట్టను తయారుచేసి ఇవ్వాలి. నిబంధనల మేరకు నూలు పొంది బట్టను తయారు చేయాలని సిరిసిల్ల చేనేత, జౌళిశాఖ ఏడీ మిట్టకోల సాగర్ కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి



వస్త్రోత్పత్తిదారులు నూలు డిపోను సద్వినియోగం చేసుకోవాలి. నూలు సరఫరాపై విధివిధానాలను నేతన్నలకు వివరించాం. శనివారం నుంచి 90 శాతం అరువుపై నూలు సరఫరాకు ఏర్పాట్లు చేశాం. నిబంధనల మేరకు నూలును తీసుకుని నాణ్యమైన వస్త్రాన్ని టెస్కో అందించాలి. దీని ద్వారా దీర్ఘకాలికంగా వస్త్రోత్పత్తిదారులకు ఎంతో మేలు.

– వి.అశోక్‌రావు, టెస్కో జనరల్ మేనేజర్, హైదరాబాద్

పెద్దింటి అశోక్‌కుమార్‌కు డాక్టరేట్



సిరిసిల్ల: గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటకు చెందిన ప్రముఖ కథకుడు, సినీ మాటలు, పాటల రచయిత, ఉపాధ్యాయుడు పెద్దింటి అశోక్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను శుక్రవారం ప్రకటించింది. 'తెలంగాణ వలస కథలు, వస్తు శిల్ప వైవిధ్యం' అనే అంశంపై పెద్దింటి అశోక్‌కుమార్ చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇప్పటికే అశోక్‌కుమార్ రాసిన 'లాంగ్‌మార్చ్', 'జిగిరి' అనే రెండు నవలలు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పీజీ, డిగ్రీ విద్యార్థులకు సిలబస్‌గా ఉన్నాయి. ఆయన సాహిత్యం మీద వివిధ యూనివర్సిటీలలో నాలుగు పీహెచ్‌డీ, ఆరు ఎంఫిల్ పరిశోధనలు జరిగాయి. మరో మూడు పీహెచ్‌డీ పరిశోధనలు జరుగుతున్నాయి. సిరిసిల్ల పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్ ఇప్పటి వరకు 300లకు పైగా కథలు, 8 నవలలు, 5 నాటకాలతోపాటు సినిమాలకు కథలు, మాటలు, పాటలు రాసి, కొన్ని సినిమాల్లో నటించారు. ఆయన రాసిన జిగిరి నవల ఇంగ్లిష్‌తోపాటు 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. పీహెచ్‌డీ కోసం పెద్దింటి అశోక్‌కుమార్ ఓ పరీక్ష రాయగా.. ఆయన రాసిన 'జిగిరి' నవలపై ఆయనకే ప్రశ్న రావడం విశేషం. ఉస్మానియా యూనివర్సిటీ త్వరలో డాక్టరేట్ పట్టాను అందించనుంది. అశోక్‌కుమార్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా రచయితలు జిందం అశోక్, గర్రిపెల్లి అశోక్, చిటికెన కిరణ్, నర్సింహులు, అంజన్‌రెడ్డి, దశరథం, బూర దేవానందం, కందుకూరి రమేశ్‌బాబు, ఎలగొండ రవి, మల్లారెడ్డి, వాసరవేని పర్శరాములు, నేరోజు రమేశ్ అభినందలు తెలిపారు.